క్లుప్తంగా

నేడు హనుమజ్జయంతి

నెల్లూరు(బృందావనం): హనుమజ్జయంతి సందర్భంగా మైపాడుగేట్ సెంటర్‌లోని ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానంలో శనివారం ఉదయం 6 గంటల నుంచి విశేషాభిషేకాలు, పూజలు, సాయంత్రం 6 గంటలకు పూలంగిసేవ, రాత్రి 8 గంటలకు పల్లకి సేవ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు మద్దూరు సుబ్బారావు తెలిపారు. మైపాడుగేట్ మిత్రమండలి ఆధ్వర్యంలో మధ్యాహ్నం 12గంటలకు అన్నప్రసాద వితరణ చేయనున్నట్లు చెప్పారు. భక్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

• పప్పులవీధిలోని ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానంలో ఉదయం 7గంటలకు లక్ష తమలపాకుల పూజ, 10.30 గంటలకు సీతారామ లక్ష్మణసువర్చల ఆంజనేయస్వామికి తిరుమంజనం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

పొగాకు ఉత్పత్తులకు యువత బలి



వైద్యులను సన్మానిస్తున్న పీహెచ్‌పీ అసోసియేషన్ నాయకులు

నెల్లూరు(అర్బన్): పొగాకు ఉత్పత్తులకు బానిసై యువత బలవుతున్నారని ప్రభుత్వ మెడికల్ కళాశాల చర్మవ్యాధుల నిపుణులు డాక్టర్ కృష్ణమూర్తి అన్నారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వేదాయపాళెంలోని అలెన్ రాయల్ దంత వైద్యశాల సమావేశ మందిరంలో పొగాకు ఉత్పత్తుల వాడకంతో కలిగే నష్టాలపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ కృష్ణమూర్తి మాట్లాడుతూ పొగాకు మాన్పించేందుకు పెద్దాస్పత్రిలో కౌన్సిలింగ్, థెరపి కేంద్రం ఉందన్నారు. గుండె జబ్బులు, కేన్సర్‌ల బారిన పడకుండా ఉండాలంటే పొగాకు ఉత్పత్తులను వినియోగించరాదన్నారు. అనంతరం వైద్యులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌పీ గౌరవాధ్యక్షుడు అనుమల జయప్రకాష్, అధ్యక్షుడు శాఖవరపు వేణుగోపాల్, రూడ్స్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ రసూల్, నాయకులు శేషయ్య, దేవరకొండ శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఆదాల విజయాన్ని కాంక్షిస్తూ పూజలు



శ్రీశైలంలో పూజలు నిర్వహించిన నాయకులు

నెల్లూరు సిటీ: రూరల్ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ వైఎస్సార్‌సీపీ రూరల్ నాయకులు శ్రీశైలంలోని జ్యోతిర్లింగ మల్లికార్జునస్వామి అంతరాలయంలో శుక్రవారం పూజలు నిర్వహించారు.అనంతరం శ్రీశైల శక్తి పీఠం అమ్మవారు భ్రమరాంబికాదేవి ఆలయంలోనూ పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సేవాదళ్ సెక్రటరీ, 20వ డివిజన్ ఇన్‌చార్జి రావు శ్రీనివాసరావు మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం కావాలని, విజయసాయిరెడ్డి ఎంపీగా అత్యధిక మెజార్టీతో గెలవాలని కాంక్షిస్తూ పూజలు నిర్వహించినట్లు తెలిపారు. నెల్లూరు మార్కెట్ కమిటీ చైర్మన్ పేర్నేటి కోటేశ్వరరెడ్డి, 31వ డివిజన్ ఇన్‌చార్జి చెన్నారెడ్డి నవీన్‌రెడ్డి, 19వ డివిజన్ ఇన్‌చార్జి వరాల లక్ష్మీనారాయణ, ఏఎంసీ డైరెక్టర్ తాటిపర్తి వెంకటేష్,తదితరులు పాల్గొన్నారు.

వీరభద్రస్వామికి విశేష పూజలు

మనుబోలు: స్థానిక బస్టాండ్ సెంటర్‌లో ఉన్న భద్రకాళి సమేత వీరభద్రస్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో మహాకుంభాభిషేక మహోత్సవాన్ని జరిపి ఏడాది పూర్తయిన సందర్భంగా అర్చకుడు శ్రీనివాసులు ఆధ్వర్యంలో వీరభద్రస్వామికి ఉదయం పంచామృతాభిషేకం, మహాన్యాసపూర్వక రుద్రాభిషేకాన్ని నిర్వహించారు.

కుక్కలున్నాయ్..పిక్కలు జాగ్రత్త

• నగరంలో స్వైరవిహారం చేస్తున్న వీధి కుక్కలు
• రోడ్లపైకి రావాలంటే జంకుతున్న ప్రజలు
• ఏటా పెరుగుతున్న కుక్క కాటు బాధితుల సంఖ్య
• నియంత్రణకు అధికారులు చర్యలు తీసుకోవాలంటున్న ప్రజలు



నగరంలోని వీధులో వీధి కుక్కలు సంచరిస్తున్న దృశ్యం

నెల్లూరు(బారకాసు): నగరంలో వీధి కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా పిక్కలు పీకేస్తున్నాయి. సాధారణంగా ఏదైనా ఇంట్లో కుక్క ఉంటే గేటుపై కుక్కలున్నాయి.. జాగ్రత్త అని బోర్డులు తగిలించడం మనం చూస్తుంటాం. ఇలాగే నగరంలోని ప్రతి వీధి ముందు బోర్డు ఏర్పాటు చేయాలేమో అన్న తరహాలో వీధి కుక్కలు నగర ప్రజలకు చుక్కలు చూపిస్తున్నాయి. ముఖ్యంగా రాత్రి వేళల్లో వీధుల్లోకి వచ్చేందుకు ప్రజలు జంకుతున్నారు. ప్రధానంగా మహిళలు, చిన్నారులు, వృద్ధులపై కుక్కలు దాడి చేస్తున్నాయి. ద్విచక్ర వాహనాలపై వెళ్లే వారిని వెంటాడుతుండడంతో ఎక్కడ కరుస్తాయోనని భయాందోళనలు చెందుతున్నారు. వీధి కుక్కల నియంత్రణపై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో నగరంలో వాటి సంఖ్య నానాటికి పెరుగుతోందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కుక్కల బెడద తీవ్రంగా ఉన్న ప్రాంతాలు

నగరంలోని నవాబుపేట, జాకీర్‌హుస్సేన్‌నగర్, న్యూకాలనీ, మారుతీనగర్, కిసాన్‌నగర్, వెంకటేశ్వరపురం, భగత్‌సింగ్‌కాలనీ, సంతపేట, మూలాపేట, ఫత్తేఖాన్‌పేట, వనంతోపుసెంటర్, కొండాయపాళెంగేట్, పొదలకూరురోడ్డు, డైకాస్‌రోడ్డు, మనుమసిద్ధినగర్, ఏసీనగర్, బాలాజీనగర్, సత్యనారాయణపురం, నజీర్‌తోట, రంగనాయకులపేట, గాంధీనగర్, వేదాయపాళెం, భక్తవత్సలనగర్‌తో పాటు ఇతరప్రాంతాలల్లో చికెన్ దుకాణాలున్నాయి. ఆయా దుకాణాల వద్ద కోళ్ల వ్యర్థాల కోసం కుక్కలు గుంపులుగా చేరుతుండడంతో వాటి బెడద తీవ్రంగా ఉంటోందని నగరవాసులు చెబుతున్నారు.

ప్రజలు బెంబేలు

నగరపాలక సంస్థ పరిధిలోని 54 డివిజన్‌లలో దాదాపు 8లక్షల నుంచి 10 లక్షల మంది వరకు నివసిస్తున్నారు. ప్రతి వీధిలో కనీసం మూడు నుంచి ఐదు కుక్కలు వరకు తిరుగుతున్నాయి. ఇలా నగరంలో దాదాపు 50వేలకు పైగా వీధి కుక్కలు ఉన్నట్లు అంచనా. ఆయా వీధుల్లో ఎవరైనా బైక్‌పై లేదా నడిచి వెళ్తుంటే వారిని కుక్కలు తరుముకుంటున్నాయి. దీంతో వారు నిత్యం బెంబేలెత్తుతున్నారు.

ఏటా పెరుగుతున్న బాధితులు

జిల్లాలో కుక్కకాటుకు గురవుతున్న వారు అధిక సంఖ్యలో ఉన్నారు. ఏటా బాధితుల సంఖ్య పెరుగుతూనే ఉంది. 2022లో 12,691 మంది కుక్కకాటుకు గురై చికిత్స పొందగా, 2023లో 16,979 మంది బాధితులు టీకాలు వేయించుకున్నారు. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు 9,746 కుక్క కాటు కేసులు నమోదయ్యాయి. ఇందులో నగరానికి సంబంధించి 1796 మంది కుక్క కాటుకు గురైనట్లు అధికారిక సమాచారం. అనధికారికంగా వేల సంఖ్యలో కుక్క కాటుకు గురైన బాధితులు ఉండొచ్చని సమాచారం. వీధి కుక్కలకు సంతానోత్పత్తి కలగకుండా శస్త్రచికిత్సలు చేయకపోవడంతో వాటి సంఖ్య భారీగా పెరుగుతోందని తెలుస్తోంది. గతంలో వేల సంఖ్యలో ఉన్న కుక్కలు ఇప్పుడు లక్షకుపైగా చేరినట్లు సమాచారం. ఇప్పటికైనా అధికారులు స్పందించి నగరంలో వీధి కుక్కల నియంత్రణకు పటిష్టమైన చర్యలు చేపట్టి వాటి బెడద నుంచి కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

కొన్ని ఘటనలు..

• గతేడాది మే 2న నగరంలోని వీఆర్సీసెంటర్, పొగతోట, గాంధీబొమ్మసెంటర్, తదితర ప్రాంతాల్లో పట్టపగలే పిచ్చికుక్క స్వైరవిహారం చేసింది. దాదాపు 50 మందికిపైగా పిచ్చికుక్క కాటు బారినపడ్డారు.
• గత నెల 10న నగరంలోని బాలాజీనగర్, కొప్పర్తివారివీధిలో వీధి కుక్కల దాడిలో ఇరువురు గాయాలపాలయ్యారు.. వీరిద్దరూ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందారు.ఇటువంటి ఘటనలు నగరంలో నిత్యం ఏదోక ప్రాంతంలో జరుగుతూనే ఉన్నాయి.

కుక్కల నియంత్రణకు చర్యలు



నగరపాలక సంస్థ పరిధిలో వీధి కుక్కల నియంత్రణకు చర్యలు చేపడుతున్నాం. వీధి కుక్కలను పట్టుకుని పాత మున్సిపల్ కార్యాలయ సమీపంలోని యానిమల్ బర్త్ కంట్రోల్(ఏబీసీ) కేంద్రానికి తీసుకొచ్చి శస్త్రచికిత్స చేస్తున్నాం. ఈ ప్రక్రియ నిత్యం జరుగుతూనేఉంటుంది. పిచ్చి కుక్కలను గుర్తించిన వెంటనే తమకు సమాచారం ఇస్తే వాటిని పట్టుకుని తగిన చర్యలు చేపడుతాం. ఎండాకాలంలో అధికంగా దాహం వేయడం, సేద తీరేందుకు చల్లదనం లేకపోవడంతో కుక్కలు కరిచే ప్రమాదం ఉంది.

– డాక్టర్ మదన్‌మోహన్, వెటర్నరీ వైద్యుడు, నగర పాలక సంస్థ

ఇమ్యూనోగ్లోబియన్స్ ఇంజెక్షన్ తప్పనిసరి



కుక్కకాటుకు గురైన వ్యక్తుల వంటిపైన రెండు, మూడు లేదా అంతకంటే ఎక్కువగా గాయాలుంటే రేబీస్ వ్యాక్సిన్‌తో పాటు ఇమ్యూనోగ్లోబియన్స్ ఇంజెక్షన్‌ను కరిచిన చోట వేయించుకోవాలి. చాలా మందికి అవగాహన లేక రేబీస్ వ్యాక్సిన్ మాత్రమే వేసుకుని మృత్యువాత పడుతున్నారు. రేబీస్ వ్యాధికి సరైన వైద్యం లేదు. నివారణ మాత్రమే ఉందన్న విషయాన్ని ప్రజలందరూ గమనించాలి. జిల్లా ఆస్పత్రులతో పాటు సీహెచ్‌సీల్లో ఉచితంగా ఇమ్యూనోగ్లోబియన్స్ ఇంజక్షన్‌ను ఉచితంగా వేస్తారు.

– డాక్టర్ శింగంశెట్టి భాస్కర్, జిల్లా సర్వలెన్స్ అధికారి.

కుక్కలు దాడులు చేస్తున్నాయి



వీధి కుక్కలతో తరచూ ఇబ్బందులు పడుతున్నాం. ముఖ్యంగా చిన్నారులు, మహిళలు బయటకు రావాలంటేనే జంకుతున్నారు. మనుషులతో పాటు మూగజీవాలను చంపి తింటున్నాయి. అధికారులు చర్యలు తీసుకోవాలి.

– మహేష్‌సింగ్, సంతపేట, నెల్లూరు.

కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి



నగరంలోని పలు ప్రాంతాల ప్రజలు కుక్కల బెడదతో తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి సమయాల్లో బయటకు రావాలంటేనే భయపడుతున్నారు. అధికారులు స్పందించి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి.

– సుబ్బారెడ్డి, సత్యనారాయణపురం, నెల్లూరు

ప్రభుత్వ అనుమతులు లేకుండానే అడ్మిషన్లు



సమావేశంలో మాట్లాడుతున్న నేతాజీ సుబ్బారెడ్డి, శ్రీధర్

నెల్లూరు (టౌన్): జిల్లాలో అనుమతులు లేకుండానే శ్రీచైతన్య యాజమాన్యం ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలలను ప్రారంభిస్తోందని అపస్మా రాష్ట్ర సీనియర్ వైస్‌ప్రెసిడెంట్ సుబ్బారెడ్డి, జిల్లా అధ్యక్షుడు శ్రీధర్ ఆరోపించారు. నగరంలోని నేతాజీ పైలెట్ స్కూల్లో అపస్మా ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న పాఠశాలలపై అపస్మా ఆధ్వర్యంలో అనేకసార్లు జిల్లా విద్యాశాఖాధికారులకు ఫిర్యాదు చేశామన్నారు. శ్రీచైతన్య విద్యాసంస్థ ప్రభుత్వ అనుమతులు లేకుండానే భవన నిర్మాణాలు పూర్తవక ముందే అడ్మిషన్లు స్వీకరిస్తోందని ఆరోపించారు. జీఓ నంబర్ 1 ప్రకారం ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలను ఏ యాజమాన్యం కింద అయినా నూతనంగా ప్రారంభించాలంటే ఆ ప్రాంతంలో పాఠశాలలు అందుబాటులో లేకుండా ఉండాలన్నారు. నూతన ప్రైవేట్ పాఠశాలల ఏర్పాటుకు అనుమతుల కోసం దరఖాస్తు చేసినప్పుడు సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో ఉన్నాయా..లేవా అని పరిశీలించి నివేదిక అందజేయాలన్నారు. నూతన పాఠశాలలు ప్రభుత్వ నిబంధనల ప్రకారం అడ్మిషన్లను తీసుకుని నిర్దేశించిన సిలబస్‌ను బోధిస్తూ తగిన పరిస్థితులు ఉన్నప్పుడు మాత్రమే గుర్తింపును ఇవ్వాలన్నారు. నగరంలో శ్రీచైతన్య విద్యాసంస్థ ఒకేసారి ఐదు బ్రాంచ్‌లను ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా ప్రారంభించిందని, భవన నిర్మాణాల దశలోనే అడ్మిషన్లు స్వీకరిస్తోందని ఆరోపించారు. దీనివల్ల భవిష్యత్తులో ప్రస్తుతం ఉన్న విద్యా సంస్థల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. ఈ సమావేశంలో అపస్మా సెక్రటరీ వెంకట్రామయ్య, జిల్లా గౌరవ సలహాదారులు మల్లికార్జున, నగర అధ్యక్షులు రామ్మోహన్‌రెడ్డి, కరస్పాండెంట్లు పాల్గొన్నారు.

న్యూ జర్నలిస్టు కాలనీలో అపరిచితుల అలజడి

నెల్లూరు(క్రైమ్): కొత్తూరులోని న్యూ జర్నలిస్టుకాలనీలో గురువారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు సంచరించడంతో ఆ ప్రాతంలో అలజడి రేగింది. స్థానికుల సమాచారంతో వెంటనే స్పందించిన వేదాయపాళెం ఇన్‌స్పెక్టర్ పీవీ నారాయణ గస్తీని ముమ్మరం చేశారు. గత కొద్దిరోజులుగా న్యూ జర్నలిస్టు కాలనీలో అపరిచితులు సంచరిస్తున్నారు. ప్రత్యేకించి రాత్రి వేళల్లోనే ఇంటింటికి వెళ్లి యాచిస్తున్నారు. వారి వ్యవహారశైలి, వస్త్రధారణ అనుమానాస్పదంగా ఉండడంతో స్థానికులు ఆందోళనకు గురవుతున్నారు. గురువారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఆ ప్రాంతంలో ఉండగా స్థానికులు ప్రశ్నించగా సరైన సమాధానం చెప్పకుండా అక్కడి నుంచి పరుగులు తీస్తూ వెళ్లిపోయారు. స్థానికులు వేదాయపాళెం పోలీసులకు సమాచారం అందించగా ఇన్‌స్పెక్టర్ తన సిబ్బందిని అప్రమత్తం చేశారు. వారు హుటాహుటిన అక్కడికి చేరుకుని చుట్టపక్కల గాలించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ కాలనీపై ప్రత్యేక నిఘా పెడుతున్నట్లు చెప్పారు. అనుమానాస్పద వ్యక్తులు తారసపడితే డయల్ 112కు సమాచారం అందిస్తే తగిన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

శేషజీవితం హాయిగా గడపాలి



ఉద్యో విరమణ పొందిన సిబ్బందితో ఎస్పీ ఆరిఫ్‌హఫీజ్

నెల్లూరు(క్రైమ్): ఉద్యోగ విరమణ పొందిన పోలీసు సిబ్బంది శేష జీవితాన్ని కుటుంబ సభ్యులతో ఆయురారోగ్యాలతో హాయిగా గడపాలని ఎస్పీ కే ఆరిఫ్‌హఫీజ్ సూచించారు. డీటీసీ, కమ్యూనికేషన్ ఎస్సైలు డీ సుబ్రహ్మణ్యం, శేషగిరిరావు, బిట్రగుంట ఏఎస్సై ఎం చెన్నయ్య, ఏఆర్ఎస్సై ఎం వెంకటేశ్వర్లు, ఏఆర్‌హెచ్‌సీ కే వెంకటరావు, బీడీ టీమ్ హోమ్‌గార్డు ఎం నిరంజన్‌రెడ్డి శుక్రవారం ఉద్యోగ విరమణ పొందారు. వారి ఆత్మీయ వీడ్కోలు సభను నగరంలోని ఉమేష్‌చంద్రా మెమోరియల్ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించారు. ఉద్యోగ విమరణ పొందిన సిబ్బందిని ఎస్పీ శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మూడు దశాబ్దాల పాటు క్రమశిక్షణ, అంకితభావంతో విధులు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఉద్యోగ విరమణ పొందిన వారికి ఎలాంటి అవసరం ఉన్నా ఏ సమయంలో అయినా అందుబాటులో ఉండి తోడ్పాటును అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీలు సీహెచ్ సౌజన్య, శ్రీనివాసరావు, సీఐలు రామకృష్ణారెడ్డి, నాగేశ్వరమ్మ, పోలీసు అధికారుల సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మద్దిపాటి ప్రసాదరావు, శ్రీనివాసులు, ఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యం సేవలు స్ఫూర్తిదాయకం



డాక్టర్ సుబ్రహ్మణ్యం దంపతులకు సత్కారం

నెల్లూరు(అర్బన్): నగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి అడ్మినిస్ట్రేషన్ అధికారిగా ఎంతో నిజాయతీతో సేవలందించిన డాక్టర్ సుబ్రహ్మణ్యం ప్రతిఒక్కరికీ స్ఫూర్తిదాయకమని పెద్దాస్పత్రి ఏడీ ఏడుకొండలు పేర్కొన్నారు. డాక్టర్ సుబ్రహ్మణ్యం ఉద్యోగ విరమణ సభను ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడుకొండలు మాట్లాడుతూ డాక్టర్ సుబ్రహ్మణ్యం వంటి వారి వల్లనే రోగులకు మెరుగైన సౌకర్యాలు కలుగుతున్నాయన్నారు. అనంతరం డాక్టర్ సుబ్రహ్మణ్యం, హెడ్‌నర్సు వరలక్ష్మి దంపతులను ఘనంగా సత్కరించారు. అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ గంగాధర్, యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు సతీష్‌కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సందానిబాషా, పలువురు డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే ఆంధ్రప్రదేశ్ హెల్త్ అడ్మినిస్ట్రేషన్, మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్(హంస) ఆధ్వర్యంలో డాక్టర్ సుబ్రహ్మణ్యం దంపతులను ప్రత్యేకంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వెంకటేశ్వర్లు, హంస జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చేజర్ల సుధాకర్‌రావు, కమల్‌కిరణ్, శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

సుబ్బారావు సేవలు భేష్



నెల్లూరు(అర్బన్): వైద్యారోగ్యశాఖలో డ్రైవర్‌గా డక్కిలి సుబ్బారావు అందించిన సేవలు భేష్ అని హంస అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చేజర్ల సుధాకర్‌రావు కొనియాడారు. సంతపేటలోని వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో సుబ్బారావు ఉద్యోగ విరమణ సభను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సుధాకర్‌రావు మాట్లాడుతూ 35 ఏళ్లపాటు సుబ్బారావు అధికారులందరికీ తలలో నాలుకలా వ్యవహరిస్తూ మంచిపేరు తెచ్చుకున్నారన్నారు. డీఎంహెచ్‌ఓ డాక్టర్ పెంచలయ్య సైతం చిరుద్యోగికి పెన్షన్‌ను సైతం వెంటనే అందిస్తానని చెప్పడం అభినందనీయమన్నారు. అనంతరం డ్రైవర్ సుబ్బారావు దంపతులను వైద్యశాఖ ఉద్యోగులు సన్మానించారు. అసోసియేషన్ జనరల్ సెక్రటరీ కమల్‌కిరణ్. నాయకులు మజురుల్లా, నాగరాజమ్మ, మురళి, తదితరులు పాల్గొన్నారు.

నాగేశ్వరరావు సేవలు ఎనలేనవి



నాగేశ్వరరావు దంపతులను సత్కరిస్తున్న జడ్జి యామిని

నెల్లూరు (లీగల్): జిల్లా కోర్టు సెంట్రల్ నజారత్‌గా డీ నాగేశ్వరరావు అందించిన సేవలు ఎనలేనివని జిల్లా ప్రధాన న్యాయమూర్తి యామిని కొనియాడారు. జిల్లా కోర్టు సెంట్రల్ నజారత్ డీ నాగేశ్వరరావు, ఏఓ ఆఫీస్ జూనియర్ అసిస్టెంట్ శ్రీధర్ ఉద్యోగ విరమణ సభను జిల్లా కోర్టు ప్రాంగణంలోని కాన్ఫరెన్స్ హాల్లో శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా జడ్జి యామిని అధ్యక్షత వహించి మాట్లాడారు. ఇరువురు ఉద్యోగులు న్యాయశాఖలో నిజాయతీగా సేవలు అందించారని, వారిని ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఇరువురి శేష జీవితం హాయిగా సాగాలని ఆకాంక్షించారు. అనంతరం వారిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో న్యాయ శాఖ ఉద్యోగుల సంఘ జిల్లా అధ్యక్షుడు సురేష్‌బాబు, ప్రధానకార్యదర్శి నారాయణరెడ్డి, అసోసియేట్ ప్రెసిడెంట్ శివకుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ దీపక్, మహిళా ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు పౌష్టికాహారం పంపిణీ



నెల్లూరు(బృందావనం): నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రీడాకారులకు శుక్రవారం పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో వేసవి శిబిరంలో శిక్షణ పొందుతున్న 900 మంది క్రీడాకారులకు వాకర్స్ ఇంటర్నేషనల్ డిప్యూటీ గవర్నర్ కనకట్ల రఘురామ్ ముదిరాజ్, కో ఆర్డినేటర్ నలుబోలు బలరామయ్యనాయుడు, పాబోలు సత్యనారాయణ సౌజన్యంతో పౌష్టికాహారం అందజేశారు. ఇంటర్నేషనల్ వాకర్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు నేతాజీ సుబ్బారెడ్డి, పలగాటి శ్రీనివాసులు రెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. వాకర్స్ అసోసియేషన్ నిర్వాహకులు డీ అనంతరామారావు, జీ వెంకటసురేంద్రబాబు, సాయిరాం, విజయ్‌రాఘవేంద్ర, డీ రమణయ్యగౌడ్, జీ రఘురామనాయుడు, వీ రామానాయుడు, ఎస్ రఘురామనాయుడు, గోవిందయ్య, ఎస్ రమేష్, శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శివరామకృష్ణ సేవలు మరువలేనివి



శివరామకృష్ణకు సత్కారం

నెల్లూరు(వీఆర్సీసెంటర్): లైన్‌ఇన్‌స్పెక్టర్‌గా వడ్డే శివరామకృష్ణ అందించిన సేవలు మరువలేనివని విద్యుత్‌శాఖ నెల్లూరుటౌన్–2 డీఈఈ మధుసూదన్‌రెడ్డి అన్నారు. నగరంలోని జనార్దన్‌రెడ్డికాలనీలోని విద్యుత్ సెక్షన్ కార్యాలయంలో శివరామకృష్ణ ఉద్యోగ విరమణ సభను శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీఈఈ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. శివరామకృష్ణ శేషజీవితాన్ని సుఖసంతోషాలతో గడపాలని ఆకాంక్షించారు. అనంతరం లైన్‌ఇన్‌స్పెక్టర్‌ను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కిసాన్‌నగర్ విద్యుత్ సెక్షన్ ఏఈ విజయ్‌కుమార్, పలువు లైన్‌ఇన్‌స్పెక్టర్లు, లైన్‌మెన్లు, ఏఎల్‌ఎంలు, జేఎల్‌ఎంలు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం



నెల్లూరు(బృందావనం): విశ్వమాత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నగరంలోని నోవా బ్లడ్ బ్యాంక్‌లో శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. పలువురు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు దూబిశెట్టి కల్యాణి మాట్లాడుతూ ఫౌండేషన్ నాల్గో వార్షికోత్సవం, నాగిశెట్టి మురళీకృష్ణ పుట్టిన రోజు సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహించినట్లు చెప్పారు. రక్తదాతలకు ధన్యవాదాలు తెలిపారు. గునుకుల కిషోర్, దగ్గుపాటి రాధాకృష్ణ, కే మల్లికార్జున, పీ కిషోర్, పీ పవన్‌కుమార్, గులాంహుస్సేన్ పాల్గొన్నారు.

భానుడి భగభగ..జనం విలవిల



మళ్లీ ఎండలు మండుతున్నాయి. ఉదయం 9 గంటల నుంచే భానుడు నిప్పులు చెరుగుతుండడంతో నగర ప్రజలు విలవిల్లాడుతున్నారు. వేసవితాపంతో ఇళ్ల నుంచి బయటకొచ్చేందుకు జంకుతున్నారు. వివిధ పనులపై బయటకొచ్చిన వారు వేసవి తాపం నుంచి ఉపశమనం పొందేందుకు చెట్ల కిందకు పరుగులు తీస్తున్నారు. ఇలా నగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి వచ్చిన రోగులతో పాటు సిబ్బంది శుక్రవారం చెట్ల నీడన సేదతీరుతూ కనిపించారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్ , నెల్లూరు



